సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

యోగా శిక్షణ ప్రారంభం



యోగాసనాలు అభ్యాసం చేస్తున్న సాధకులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల యోగా శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. శిక్షణను ప్రారంభించిన బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి మాట్లాడుతూ ఈ నెల 21 వరకు ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. రోజూ సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు వరకు శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గలవారు చేరవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, హంస మహేష్, శిక్షకుడు శ్రీహరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: పద్మనాభం సబ్ స్టేషన్ పరిధిలోని గంధవరం ఫీడర్ లైన్‌లో చెట్లు తొలగించే పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మద్ది, తునిపాలం, విలాస్కాన్‌పాలెం, బాందేవుపురం, విజయరాంపురం గ్రామాల్లో పైన పేర్కొన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

వెంకటాపురంలో మోటార్ బైక్ చోరీ

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో మోటార్ బైక్ చోరీకి గురైంది. గ్రామంలో కర్రి శ్రీను కుమారుడు హరి ప్రసాద్ ఇంటి వద్ద డ్యూక్ మోటార్ బైక్‌ను బుధవారం రాత్రి పార్క్ చేశాడు. గురువారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో చూడగా బైక్ కనిపించలేదు. దీనిపై హరి ప్రసాద్ పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు పక్కన ఒరిగిన లారీ



రోడ్డు పక్కకు ఒరిగిపోయిన బియ్యం లోడ్ లారీ

తగరపువలస: తగరపువలస–భీమిలి రహదారిలో గురువారం మధ్యాహ్నం బియ్యం లోడుతో కూడిన లారీ రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. తగరపువలసలో బియ్యం అన్‌లోడ్ చేసేందుకు పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చిన లారీ ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో చిల్లపేట చెరువు వద్ద నిలపడానికి వచ్చారు. వంట చేసుకునేందుకు ఉపక్రమించి లారీని రోడ్డు పక్కకు దించగా అసలే బియ్యం లోడు, ఇటీవల వర్షాలకు బురదగా మారిపోవడంతో లారీ పక్కకు ఒరిగిపోయింది. లారీ సిబ్బంది ముఠా కార్మికుల సాయంతో ముందు బియ్యం మూటలను ఖాళీ చేసి, తర్వాత లారీని బయటకు లాగే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ముగిసిన ఆశ వర్కర్ల మహాసభ

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో నిర్వహించిన ఆశ వర్కర్ల మహాసభ గురువారం ముగిసింది. సిటు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వారీగా నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కనీస వేతనం రూ.26వేలు సాధించడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పనిభారం తగ్గించాలని తీర్మానించారు. తాళ్లవలస పీహెచ్‌సీ అధ్యక్ష, కార్యదర్శులుగా సన్యాసి పైడమ్మ, ఎల్లయ్యమ్మ, భీమిలి యూపీహెచ్‌సీ అధ్యక్షురాలిగా పి.సూర్యకళ, తగరపువలస యూపీహెచ్‌సీ అధ్యక్షురాలిగా అన్నపూర్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, దయాని, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



రన్నర్స్‌గా నిలిచిన సాధిల్, వెంకట నితిన్

భీమునిపట్నం: జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భీమిలికి చెందిన బాలురు ప్రతిభ చూపారు. విశాఖలో రెండు రోజుల క్రితం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 15 విభాగంలో భీమిలి ఇండోర్ స్టేడియంలో నవనీత్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన బి.సాధిల్, కె.వెంకట నితిన్ డబుల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచారు. వీరిని కోచ్ ఫల్గుణ, సభ్యులు అభినందించారు.

జీవీఎంసీ పాఠశాలల్లో ఏమిటీ దుస్థితి?

వసతులున్న చోట నామమాత్రంగా విద్యార్థులు ■ విద్యార్థులున్న బడిలో సౌకర్యాల లేమి
అడ్మిషన్లు అంతంతమాత్రం ■ తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య



రూ.కోటితో వసతులు కల్పించిన సంగివలస పాఠశాల

నాడు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు చదువుల కోవెలలుగా రూపుదిద్దుకున్నాయి. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయి. అమ్మ ఒడి ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక భరోసా లభించింది. దీంతో విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడాయి.



వసతులు లేని విల్సన్‌పేట పాఠశాల

నేడు.. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలో ప్రభుత్వ పాఠశాలలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. వీటిపై శ్రద్ధ కనబరచక పోవడంతో ఈ ఏడాది అడ్మిషన్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో 'తల్లికి వందనం' జమ కానేలేదు. వసతులున్న చోట విద్యార్థుల్లేరు.. విద్యార్థులున్న పాఠశాలల్లో సౌకర్యాలు లేవు. ఇదీ పరిస్థితి..

భీమిలి జోన్ పరిధిలోని జీవీఎంసీ పాఠశాలల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలతో కళకళలాడిన పాఠశాలలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పలు పాఠశాలలను సందర్శించగా కనిపించిన పరిస్థితులివి.. -తగరపువలస

వర్షానికి కారుతూ..

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని మామిడిపాలెం ప్రాథమిక పాఠశాల పైకప్పు దెబ్బతినడంతో నీరు కారిపోతోంది. గత కొద్ది రోజులుగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో బుధవారం కూడా నీరు కారుతూనే ఉంది. దీంతో తొలిరోజు సుమారు 30 మంది విద్యార్థులు హాజరైనా, తరగతులు సరిగ్గా జరగలేదు,



మామిడిపాలెం పాఠశాలలో శ్లాబ్ నుంచి నీరు కారడంతో బకెట్లు, పాత్రలు ఉంచిన దృశ్యం

వసతులున్నా 20మంది విద్యార్థులే..

రెండోవార్డు సంగివలసలో గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమంలో భాగంగా గతేడాది రూ.కోటితో వసతులు కల్పించారు. ఇందులో భాగంగా నాలుగు తరగతి గదులు, విశాలమైన హాలు, ఆధునిక వాష్‌రూమ్‌లు, మోటారుతో కూడిన బోరుబావి, అన్ని వసతులతో విశాలమైన పార్కు, ప్రహరీ, సోలార్ వంటివి ఏర్పాటు చేశారు. 200 మంది విద్యార్థులతో ప్రాథమికోన్నత పాఠశాల నిర్వహణకు సరిపడినన్ని వసతులు ఉన్న ఈ పాఠశాలలో ఒక హెచ్ఎం, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. 20 మంది విద్యార్థులు ఉన్నట్టు ఉపాధ్యాయులు తెలియజేసినా మొదటిరోజు ఆరుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. గడిచిన విద్యా సంవత్సరంలో 5వ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థులు రిలీవ్ అయినా, ప్రస్తుతం ఆ లోటు భర్తీ అయ్యేలా విద్యార్థులు చేరే అవకాశం కనిపించడం లేదు.



విద్యార్థులు లేక నిరుపయోగంగా తరగతి గది, ఫర్నిచర్

తరగతి గదుల్లో పెచ్చులూడిన శ్లాబ్‌లు

ఒకటోవార్డు విల్సన్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల నాడు–నేడు రెండో విడత కూడా ఎంపిక కాలేదు. గడచిన విద్యాసంవత్సరంలో 61 మంది విద్యార్థులు ఉండగా 5వ తరగతి నుంచి 29 విద్యార్థులు బయటకు వెళ్లిపోయారు. ప్రస్తుతం 32 మంది విద్యార్థులకు మొదటి రోజు 20 మంది హాజరయ్యారు. ఈ పాఠశాలను ఆనుకుని ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం విద్యార్థినులు ఈ ఏడాది ఈ పాఠశాలలో పదుల సంఖ్యలో చేరే అవకాశం ఉంది. కానీ ఇక్కడ ఉన్న రెండు తరగతి గదులు వర్షానికి కారిపోతున్నాయి.



పెచ్చులు ఊడిన విల్సన్‌పేట పాఠశాల

ప్రార్థన చేసేందుకూ స్థలం లేక..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పరిధి ఎండాడ జెడ్పీ హైస్కూల్‌ను గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడులో భాగంగా రెండు విడతల్లో అభివృద్ధి చేశారు. ఇక్కడ మైదానం లేకపోవడం సమస్యగా ఉంది. 484 మంది విద్యార్థులు ఉండడంతో వారు ప్రార్థన చేయడానికి, క్రీడలకు చాలా ఇబ్బందిగా ఉంది. ఉన్న చిన్న స్థలం కూడా వర్షాలు పడితే అధ్వానంగా మారుతోంది.



మైదానం లేని ఎండాడ హైస్కూల్ ప్రాంగణం

విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయించారు



తొలిరోజు ఉపాధ్యాయులు ఎవరూ లేకుండా వదిలేసిన నమ్మివానిపేట పాఠశాల



నమ్మివానిపేట పాఠశాలలో వాష్‌రూమ్ క్లీన్ చేసిన బయటకు వస్తున్న విద్యార్థిని

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు నమ్మివానిపేట ప్రాథమిక పాఠశాలను విద్యాసంవత్సరంలో తొలిరోజే గాలికి వదిలేశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా బదిలీ కౌన్సెలింగ్ కోసం వెళ్లిపోయారు. ఉదయం 11.30 గంటల సమయంలో పాఠశాలను విజిట్ చేయగా అక్కడ ఉన్న ముగ్గురు విద్యార్థులలో ఇద్దరు వాష్‌రూమ్‌లు శుభ్రం చేస్తూ కనిపించారు. ఈ విషయాన్ని ఎంఈవో శివరాణి దృష్టిలో పెట్టగా తాను కౌన్సెలింగ్ వద్ద ఉన్నానని ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు వెళ్లే ప్రతి పాఠశాలలో ఇన్‌చార్జి ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఆమె ఆరా తీయడం మొదలు పెట్టిన తరువాత తీరికగా 12 గంటల తరువాత భీమిలి హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు చేరుకున్నారు. పాఠశాలను బాధ్యతారాహిత్యంతో వదిలేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులతో వాష్‌రూమ్‌లు శుభ్రం చేయించిన విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు ఎంఈవో తెలిపారు.

చెరువులా చంద్రంపాలెం హైస్కూల్ గ్రౌండ్

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దది అయిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను నిత్యం వేధించే సమస్య పాఠశాల గ్రౌండ్. ఇక్కడ వర్షం నీరు నిలిచిపోయి చెరువులా మారుతోంది. ఈ సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలను స్వయంగా సందర్శించి మరీ చెప్పారు. కానీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. ఇక అదనపు తరగతి గదులు, ఇతర సమస్యల పరిస్థితి అంతే.



పరిష్కారం కాని పాఠశాల గ్రౌండ్ సమస్య

అసంపూర్తిగా అదనపు తరగతి గదులు



వాంబే కాలనీలో అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదులు

వాంబేకాలనీ సునీల్ శర్మ కాలనీ హైస్కూల్లో అదనపు తరగతి గదులు అసంపూర్తిగానే దర్శనం ఇస్తున్నాయి. అదనపు ఫ్లోర్ పనులు ఏడాదిగా ప్రారంభం కాలేదు. తరగతి వరండాలోనే భారీ గ్రానైట్స్ పలకలు ప్రమాదకరంగా నిలబెట్టి వదిలేశారు. ఇవి ప్రమాదం తెచ్చిపెట్టేలా ఉన్నాయి. గత ఎన్నికలు ముందు వచ్చిన ఆర్వో ప్లాంట్‌ను ఇప్పటికీ అందుబాటులోకి తీసుకురాలేదు. ప్రారంభం కాకముందే మూలకు చేరే పరిస్థితి కనిపిస్తోంది.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోకుండా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదామని జీవీఎంసీ బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. గురువారం బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బాల కార్మికుల గురించి తెలియజేసి, వారితో పనులు చేయించడం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ సీతన్న వీధిలో రూ.6 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీలకు వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, సర్పంచ్ షిణగం అప్పలరాజు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్, నాయకులు షిణగం వెంకటరావు, ఈశ్వరరావు, కోరాడ వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ శ్రీను, సర్పంచ్ అప్పలరాజు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న రామునాయుడు

తగరపువలస: చిట్టివలస జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ప్రభుత్వం సమకూర్చిన పుస్తకాలు, యూనిఫాంను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, ఉప్పాడ నాగేశ్వరరావు, పందిరి విజయ్, అక్కరమాని చిన బాబు తదితరులు పాల్గొన్నారు. జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని శివజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు యూనిఫాం, పుస్తకాలు అందజేశారు.

భవన నిర్మాణ కార్మికులకు రక్షణ కరువు

మధురవాడ: భవన నిర్మాణ కార్మికులకు రక్షణ కరువవుతోందని, దీంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని విశాఖ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీలో గురువారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణరంగంలో కార్మికులకు ఉపాధితో పాటు సరైన భద్రత ఉండడం లేదన్నారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా దిశానిర్దేశం చేసేందుకు ఆరో జిల్లా మహాసభలు మధురవాడలో జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు పి.అప్పలరాజు, సూర్యనారాయణ, బంగారయ్య పాల్గొన్నారు.

ఇంతటి నిర్లక్ష్యమా..



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత దిశ పోలీస్ స్టేషన్ రూపురేఖలు మారిపోయాయి. దిశ పేరు మార్చి మహిళా పోలీస్ స్టేషన్‌గా చేశారు. కొద్ది నెలల క్రితం ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు అప్పుడే నేలకూలింది. అధికారులు మాత్రం దాన్ని పట్టించుకోకుండా అలాగే వదిలేయడం గమనార్హం.



ఎండాడ నుంచి కార్‌షెడ్ వెళ్లే మార్గంలో డివైడర్ మధ్య ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. జాతీయ రహదారికి రోడ్డు వైపు ఆ స్తంభం ఒరిగిపోయింది. వాహనదారులు ఏ మాత్రం చూసుకోకపోయినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోజుల తరబడి ఈ స్తంభం ఇలాగే ఉన్నా.. అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం వారి పనితనానికి నిదర్శనం.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్

అడ్డదారి వసూళ్లలో 'కింగ్'

- జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస గణేష్ థియేటర్ వద్ద ఇటీవల బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టిన ఇద్దరు మహిళా యజమానులను రెవెన్యూ విభాగానికి చెందిన ఉద్యోగి సంప్రదించారు. కమర్షియల్ ప్రాతిపదికన ఆస్తి పన్ను ఎక్కువగా వేయవలసి ఉంటుందని, అది లేకుండా రెసిడెన్షియల్ ప్రాతిపదికన ఆస్తి పన్ను విధించడానికి మధ్యవర్తులు లేకుండా అడ్వాన్స్‌గా రూ. లక్ష వంతున ఇవ్వాలని కోరాడు.
- జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలసలో జి+2 తరహాలో నిర్మించిన ఇంటి యజమానిని రెవెన్యూ విభాగ ఉద్యోగి సంప్రదించాడు. వీఎల్‌టీ లేకుండా నేరుగా పన్ను విధిస్తానని, ఆ మేరకు గత కొన్ని సంవత్సరాల పన్నులు మిగులుతాయని, దానికి గాను రూ.లక్ష అడ్వాన్స్ ఇచ్చి తనతో సెటిల్‌మెంట్ చేసుకోవాలని బతిమాలుతున్నాడు.

భీమిలి జోన్‌లో రెవెన్యూ ఉద్యోగి సెటిల్‌మెంట్లు

తగరపువలస: భీమిలి జోన్‌లో ఈ కలెక్షన్ కింగ్ వ్యవహారశైలితో రెండు నెలలుగా యజమానులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు డబ్బులు ఇచ్చి పనులు చేయించుకుంటుండగా, మిగిలిన వారు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక తటపటాయిస్తున్నారు.

జీవీఎంసీ భీమిలి జోన్ రెవెన్యూ విభాగంలో రెండు మాసాల క్రితం అడ్డదారిలో వచ్చిన ఉద్యోగి అదే దారిలో వసూళ్లకు పాల్పడుతూ సంచలనాలు సృష్టిస్తున్నాడు. మధ్యవర్తులు లేకుండానే నేరుగా ఇళ్ల యజమానులను కలిసి కమర్షియల్‌కు బదులుగా రెసిడెన్షియల్ పన్నులు విధిస్తానని, వీఎల్‌టీ లేకుండా నేరుగా పన్నులు వేస్తానని అందుకు రూ.లక్షలు ఇవ్వాలని బేరసారాలకు దిగుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే తన ఉద్యోగానికే ముప్పు ఉన్నందున అడ్వాన్స్‌గా రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు వినిపిస్తోంది. ఇప్పటికే ఇతని బారిన పడి సంగివలసలో ఒకరు, చిట్టివలస గణేష్ థియేటర్ ఏరియాకు చెందిన ఇద్దరు తమకు తెలిసినవారి వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో మధురవాడ జోన్‌లో ఈ ఉద్యోగి అక్రమ వసూళ్లకు అంతు లేకపోవడంతో స్థానికులు భరించలేక ఫిర్యాదు మీదు ఫిర్యాదులు చేయడంతో జీవీఎంసీకి సరెండర్ చేశారు. అక్కడి నుంచి మళ్లీ దొడ్డిదారిన భీమిలి జోన్‌లో అదే విభాగంలో ఒక ఉద్యోగిని ఉండగా, ఇతనిని నియమించడంలో కూటమి ప్రజాప్రతినిధుల పాత్ర ఉందని జీవీఎంసీ ఉద్యోగులే అంటున్నారు. రెవెన్యూ ఉద్యోగులపై ప్రజలలో అంతో ఇంతో ఉన్న సానుభూతి ఇలాంటి ఉద్యోగుల వలన మరింత దిగజారిపోతోందని మిగిలిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలంలో ముత్యాలమ్మ ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు ఘటాల్లో అన్నం వేశారు. ముత్యాలమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

'తల్లికి వందనం కాదు.. వంచన'

తగరపువలస: కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని మొదటి సంవత్సరం ఎగ్గొట్టి, రెండో సంవత్సరం దోబూచులాడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. ఇది 'తల్లికి వంచన' పథకంలా ఉందని పేర్కొన్నారు. గురువారం ఆయన భీమిలిలో మాట్లాడుతూ ఇప్పటికే కూటమి ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అమలు చేయడంలో విఫలం అయిందన్నారు. ఎంతమంది చదువుకుంటే అందరికీ రూ.15వేలు వంతున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఏడాది గడచిపోయినా రూ.8,475 కోట్లు మాత్రమే కేటాయించి, 67 లక్షల మంది తల్లులకే జమ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యాశాఖ వద్ద ఉన్న యూ డైస్ డేటా ప్రకారం 88 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం జమ చేయవలసి ఉందన్నారు.

మురుగునీరు తొలగింపునకు చర్యలు

మధురవాడ: నగరంపాలెం మాస్టర్‌ప్లాన్ రోడ్డులో మల్లయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో నిలిచిపోయిన మురుగునీరు తొలగింపునకు తక్షణ చర్యలు చేపడుతున్నామని పారిశుధ్య అధికారి ఎస్.సంతోష్ తెలిపారు. గురువారం మల్లయ్యపాలెం వద్ద మాస్టర్‌ప్లాన్ రోడ్డును ఆనుకుని నిలిచిపోయిన మురుగునీరును తొలగించేందుకు రోడ్డు పక్కన పేరుకుపోయిన తుప్పలను పొక్లెయిన్‌తో తొలగించారు.



పొక్లెయిన్‌తో తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

ఎస్ఐ కుమార్తె జెడ్పీ హైస్కూల్‌లో చేరిక

తగరపువలస: భీమిలి ఎస్ఐ గౌరి తన కుమార్తె గీతికశ్రీని గురువారం చిట్టివలస జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో చేర్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ గౌరిని ప్రధానోపాధ్యాయిని శివజ్యోతి అభినందించారు.